

ఉపాధి కూలీల ఓట్లే లక్ష్యం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచార వ్యూహాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. 10లో▸



నేడు రథోత్సవం

శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 10లో▸



బీజేపీది మత రాజకీయం

దేశంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, సత్యనారాయణ అన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

మే 8వరకు పోస్టల్ ఓటింగ్

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస రావు



పోస్టల్ ఓటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

తాండూరు టౌన్: లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాస రావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నంబర్–1 పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో మే 8వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బ్యాలెట్ విధానంలో ఓటేయవచ్చు అని చెప్పారు. ఓటింగ్ సెంటర్ సీసీ కెమెరాలు, పోలింగ్, పోలీసులు సిబ్బంది నిఘాలో ఉంటుందన్నారు. ఓటింగ్ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి పరిశీలించారు.

ఓటేసిన ఉద్యోగులు

పరిగి: పోస్టల్ బ్యాలెట్‌ను శుక్రవారం ఆయా శాఖల ఉద్యోగులు వినియోగించుకున్నారు. పరిగి నియోజకవర్గంలో మొత్తం 2,568 పోస్టల్ ఓట్లుండగా శుక్రవారం 124 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరు పట్టణ కేంద్రంలోని నంబర్–2 పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఓటేశారు.

ఎన్నికలకు సహకరించాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: ఎన్నికల విధుల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎంపీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో ఈ ప్రాంత ఉద్యోగులు విధుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం పరిశీలకులు నిత్యం అన్ని విషయాలు గమనిస్తున్నారని తెలిపారు. పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఎలక్షన్ డీటీ సురేశ్, ఏఓ మహేశ్‌గౌడ్, అబ్దుల్ హఖ్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించండి

డీఆర్‌డీఓ శ్రీనివాస్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

దౌల్తాబాద్: రైతులు పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని.. దళారులకు విక్రయించి మోసపోవద్దని డీఆర్‌డీఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఆయన దౌల్తాబాద్, అంతారం గ్రామాల్లో వరి ధా న్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడు తూ రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ధాన్యా న్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని చెప్పా రు. రైతులను నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్ర మంలో డీసీఎస్‌ఓ రాజేశ్, డీఎం సుగుణబాయి, ఏపీఎం సాయన్న గ్రామ సంఘం అధ్యక్షురాలు శారదబాయి, అంజమ్మ, సీసీ రామకృష్ణ తదితరులున్నారు.

నేటి నుంచి పోలీసు యాక్ట్

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా శనివారం నుంచి ఈ నెల 30 వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహణకు పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పక తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగేలా, ప్రజా ధనానికి నష్టం కలిగే ఏవిధమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టినా చర్యలుంటాయన్నారు.

తెరచాటు రాజకీయం!

పార్టీలు మారిన నేతల రాజకీయం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోంది. ప్రస్తుతం ఓ పార్టీ గుర్తుపై పోటీ చేస్తూ పాత పార్టీ నేతలతో చర్చలు సాగిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ముగ్గురూ కండువాలు మార్చినవారే కావడంతో తెరచాటు రాజకీయం రసవత్తరంగా మారింది. చేవెళ్ల లోక్‌సభ ఏర్పడిన నాటి నుంచి ఇక్కడ గులాబీ జెండానే ఎగిరింది. ప్రస్తుత త్రిముఖ పోరులో గెలిచి నిలిచేదవరో వేచి చూడాలి.



- అక్కడే ఉండి సహకరించండి.. లేదంటే మా పార్టీలో చేరండి
- ఫోన్ కాల్స్ చేస్తూ పాత నేతలను పలకరిస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- పెరుగుతున్న జంపింగ్ జపాంగ్‌లు

వికారాబాద్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది రాజకీయం రంగులు మారుతోంది. నేతలు ఊసరవెల్లుల కంటే వేగంగా జెండా రంగులు మారుస్తున్నారు. కండువాలు మార్చని వారు అదే పార్టీలో కొనసాగుతూ లోపాయికారీగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఇదే పంథా కొనసాగిస్తున్నారు. వస్తే తమ పార్టీలోకి లేదంటే అదే పార్టీలో ఉంటూ తమకు ఓటేయాలం ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. గతంలో కింది స్థాయి కార్యకర్తలు ఓ పార్టీలో ఉంటూ మరో పార్టీలకు కోవర్టులుగా వ్యవహరించిన తీరు ప్రస్తుతం ప్రధాన పార్టీల అభ్యర్థులే ఫాలో అవుతున్నారు. క్షేత్ర స్థాయిలో బాగా పని చేయాలని తమ పార్టీ నేతల ఫోన్ కాల్స్ చేస్తున్నారో.. అంతకంటే ఎక్కువగా పక్క పార్టీల నేతలతో టచ్‌లో ఉంటున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ తరహా వాతావరణం ఒకటి రెండు చోట్ల కనిపించగా లోక్‌సభ ఎన్నికల నాటికి పూర్తిగా వేళ్లూనుకుంది.

కండువాలు కదనరంగంలోకి..

అభ్యర్థులే ఓ పార్టీలో ఉంటూ మరో పార్టీ నేతలతో టచ్‌లో ఉండటానికి ప్రధాన కారణం అందరికి తెలిసిందే. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంటు బరిలో నిలిచిన అభ్యర్థులంతా తాజాగా కండువాలు మార్చిన వారే. గడ్డం రంజిత్‌రెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఈ ముగ్గురు పార్టీలు మారి బరిలో నిలిచారు. దీంతో వీరంతా పార్టీని వీడినా ఆ పార్టీల నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఊహాగానాలున్నాయి. ఇందులో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు మొదలుకుని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల వరకు ఇతర పార్టీ నేతలతో టచ్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. గడ్డం రంజిత్‌రెడ్డి మొన్నటి వరకు బీఆర్‌ఎస్‌లో ఉండి ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా మారాడు. ఇక బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను చుడుతూ బీజేపీలోకి వచ్చి ఆ పార్టీ అభ్యర్థిగా మారారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సైతం టీడీపీ, కాంగ్రెస్‌లలో ఉండి కారు గుర్తుపై పోటీ చేస్తున్నారు. ఇదే వారికి వెసులుబాటుగా మారి పాత నేతలతో చర్చలు సాగిస్తున్నారు.

'గులాబీ'ఓటర్లే టార్గెట్

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మొదలుకుని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల వరకు గులాబీ కోటరీపై కన్నేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఇటీవల చాలా మంది నేతలు హస్తం గూటికి చేరారు. ప్రస్తుతం మరి కొందరు నేతలను చేర్చుకుని పార్టీని మరింత దెబ్బదీసి ఆ పార్టీ ఓటు బ్యాంకు తమ వైపు మలుచుకునే వ్యూహం కనిపిస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి బీఆర్‌ఎస్‌లో మాజీ ఎమ్మెల్యేల నుంచి కార్యకర్తల వరకు సంబంధాలుండడంతో ఆ పార్టీ కేడర్‌ను ఖాళీ చేసేందుకు యత్నిస్తున్నారనే చర్చలు వినిపిస్తున్నాయి. లేదంటే అదే పార్టీలో ఉంటూ తమకు ఓట్లు వేయించేందుకు పావులు కదుపుతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. బీజేపీ సైతం బీఆర్‌ఎస్ ఓట్లే టార్గెట్‌గా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఓ పార్టీ నేతలు అభ్యర్థుల నుంచి పక్క పార్టీల నేతలకు నిత్యం ఫోన్ కాల్స్ వెళ్లడం సర్వ సాధారణంగా మారిపోయింది.

సూర్యుడి భగభగ



- 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- రెడ్‌జోన్‌లో బంట్వారం మండలం

బంట్వారం: జిల్లా వ్యాప్తంగా ఎండలు తీవ్రమయ్యాయి. భానుడి భగభగకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటేనే జంకుతున్నారు. శుక్రవారం జిల్లా పరిధిలోని బంట్వారంలో అత్యధికంగా 45.4 డిగ్రీల సెల్సియస్, అత్యల్పంగా వికారాబాద్ మండలంలోని మదన్‌పల్లిలో 41.0డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఎండల తీవ్రతకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. జిల్లాలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో బంట్వారం మండలాన్ని వాతావరణ శాఖ రెడ్ జోన్‌గా గుర్తించింది. బంట్వారం మండలం మినహాయిస్తే వికారాబాద్ జిల్లా ఆరెంజ్ జోన్‌లో ఉంది.

సప్లిమెంటరీలో ఉత్తీర్ణత పెరగాలి

జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి శంకర్

అనంతగిరి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికా ప్రకారం పనిచేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి ఎస్.శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. సప్లిమెంటరీ పరీక్షల్లో ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే వెలువడిన వార్షిక ఫలితాలపై సమీక్షించారు. ఫెయిల్ అయిన విద్యార్థులపై సంబంధిత అధ్యాపకులు నిరంతరం సమీక్ష నిర్వహించాలని చెప్పారు. ఫెయిల్ అయిన విద్యార్థులు తప్పక ఫీజు చెల్లించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రాజమోహన్, చెన్నయ్య, నర్సింహారెడ్డి, కుమార స్వామి, మంజుల, నర్సింలు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వరస్వామిని సన్మానిస్తున్న శంకర్, ప్రిన్సిపాల్స్



తుంకిమెట్లలో హోం ఓటింగ్‌లో పాల్గొన్న ఎన్నికల నిర్వాహణ బృందం

హోం ఓటింగ్ @12

బొంరాస్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ముందస్తుగా నిర్వహించే హోమ్ పోలింగ్‌ను ఎన్నికల ఓటింగ్ బృందం నిర్వహించింది. మండల పరిధిలోని తుంకిమెట్ల తదితర గ్రామాల్లో శుక్రవారం హోం ఓటింగ్‌లో 12మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాలను అందజేసి ఓటు వేయించారు. బ్యాలెట్ పత్రంపై 46 మంది అభ్యర్థులతో పాటుగా నోటాతో 47 గుర్తులుండగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటింగ్ వివరాలు

గ్రామం	ఓటేసినవారు
ఎన్కేపల్లి	1
కొత్తూరు	2
తుంకిమెట్ల	5
ఏర్పుమళ్ల	1
బోలెపల్లి	3

దేశంలో రాజ్యాంగ వ్యవస్థల విధ్వంసం

- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి
- పీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హరగోపాల్ తదితరులు

షాద్‌నగర్ రూరల్: దేశంలో రాజ్యాంగ వ్యవస్థలు విధ్వంసానికి గురవుతున్నాయని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని దేవిగ్రాండ్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, శాసన కార్యనిర్వాహక న్యాయవ్యవస్థ విధ్వంసానికి కేంద్రంలోని పాలకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రాజ్యాగం కల్పించిన హక్కులకు నేటి పాలకులు తూట్లు పొడుస్తూ ప్రశ్నించే మేధావులు, రచయితలు, న్యాయవాదులు, జర్నలిస్టులను అక్రమ కేసులతో జైలులో నిర్బంధిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే మరింత దారుణ పరిస్థితులు తలెత్తుతాయన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మేధావులు, కవులు, రచయితలు, జర్నలిస్టులతో పాటు ప్రజలపై కూడా ఉందన్నారు. ప్రజలు చైతన్యవంతులై ప్రలోభాలకు లొంగకుండా, భయభ్రాంతులకు గురి కాకుండా ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. టీపీజేఏసీ కో కన్వీనర్ రవిచంద్ర మాట్లాడుతూ.. దేశంలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సరైన వ్యక్తికి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని కోరారు. డాక్టర్ వనమాల మాట్లాడుతూ..ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా ముందుకు సా గుతున్నామని వెల్లడించారు. దేశంలో ప్రతి రోజు మహిళలు, యువతులు, బాలికలపై హత్యలు, అత్యాచారాలు, వేధింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు. అనంతరం చైతన్య కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాఘవాచారి, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్, టీపీజేఏసీ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ముత్తయ్య, సభ్యులు ప్రకాష్, సత్యనారాయణ, పెన్షనర్స్ సంఘం రాష్ట్ర నాయకుడు యాదయ్య, చైతన్య మహిళా సంఘం సభ్యురాలు సత్య, టీవీవీ రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్, సభ్యుడు నక్కబాల్‌రాజ్, సీఎల్‌సీ రాష్ట్ర కార్యదర్శి తిరుమలయ్య, టీపీఎఫ్ నాయకుడు అర్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

చిరుత చిక్కెన్

- ఆరు రోజులుగా ఎయిర్‌పోర్టు పరిసరాల్లో సంచారం
- మేక కోసం బోనులోకి వచ్చిన వైనం
- జూకు తరలించిన అధికారులు



బోనులో చిక్కిన చిరుత, ఇన్‌సెట్‌లో మేక కోసం బోనులోకి వెళ్తున్న చిరుత

శంషాబాద్: ఆరు రోజులుగా అటవీ, ఎయిర్‌పోర్టు అధికారులకు.. సమీప గ్రామస్తులకు ముచ్చెమటలు పట్టించిన చిరుత ఎట్టకేలకు చిక్కింది. బోనులో ఎరగా వేసిన మేకతో పాటు మాంసం కోసం వచ్చి దొరికిపోయింది. గత శనివారం అర్ధరాత్రి గొల్లపల్లి సమీపంలోని మూడు అడుగుల ఎత్తు ఉన్న ఎయిర్‌పోర్టు ప్రహరీ దూకి ఎయిర్‌పోర్టులోకి చిరుత ప్రవేశించినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. అదే రోజు రాత్రి రన్‌వేకు అత్యంత సమీపంలో సంచిరించినట్లు గుర్తించిన ఎయిర్‌పోర్టు భద్రతాధికారులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. తొలుత చిరుతా? అడవి పిల్లినా? అని అనుమానించిన అధికారులు సీసీ కెమెరాల్లో స్పష్టమైన ఆనవాళ్లు కనిపించడంతో చిరుతగా నిర్ధారించి పట్టుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. మొదట రెండు బోన్లను మాత్రమే ఏర్పాటు చేసిన అధికారులు రెండు రోజుల తర్వాత చెట్లు దట్టంగా ఉన్న ప్రాంతాల్లో మొత్తం అయిదు బోన్లను పెట్టారు. 25 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా బోన్ల వద్ద మేక మాంసంతో పాటు మేకను కూడా ఎరగా వేస్తూ వచ్చారు. రెండు రోజుల క్రితం చిరుత బోన్లకు అతి సమీపంలోకి వచ్చినా లోనికి వెళ్లలేదు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో రన్‌వేకు రెండు కిలోమీటర్ల దూరంలో చిన్నపాటి కొండలా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోను సమీపంలోకి వెళ్లింది. తొలుత బోను చుట్టూ రెండు చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత బోనులో ఉన్న మేకను చూసిన చిరుత అందులోకి ప్రవేశించిన వెంటనే వాటి గ్రిల్స్ ఒక్కసారిగా మూసుకుపోయాయి. దీంతో చిరుత చిక్కినట్లయింది.

కుందేళ్లు, నెమళ్లను తింటూ..

శుక్రవారం ఉదయం ఎఫ్‌డీఓ విజయానంద్‌రావు మాట్లాడుతూ.. ఆరురోజులుగా విమానాశ్రయం లోపలి ప్రాంతంలోనే చిరుత సంచిరించినట్లు నిర్ధారించారు. సుమారు మూడేళ్ల వయసున్న మగ చిరుతగా గుర్తించినట్లు తెలిపారు. ఆరు రోజులుగా ఏడు మీటర్ల ఎత్తున్న గడ్డి ప్రాంతంలో ఎక్కువగా ఇది సంచరించిందని పేర్కొన్నారు. కుందేళ్లు, నెమళ్లను తింటూ ఆకలి తీర్చుకుందన్నారు. సమీపంలో నీటి గుంతలు కూడా ఉండడంతో దాని దాహానికి కూడా ఎలాంటి ఇబ్బందులు కలగలేదన్నారు. చిరుత పూర్తి ఆరోగ్యంతో పాటు ఆగ్రహంగా ఉందని ఆయన చెప్పారు. దానిని జూకు తరలించి వైద్యపరీక్షలు పూర్తి చేసిన అనంతరం అమ్రాబాద్ అడవుల్లో విడిచిపెట్టనున్నట్లు చెప్పారు. అది ఏ ప్రాంతం నుంచి వచ్చిందన్నది మాత్రం ఇంకా నిర్ధారణ కాలేదన్నారు.

దేవుళ్లపై ఒట్లు.. దేవుడి పేరుతో ఓట్లు

- కాంగ్రెస్, బీజేపీలవి అవకాశవాద రాజకీయాలు
- ఈ ఎన్నికల్లో ఆ పార్టీలకు గుణపాఠం చెప్పాలి
- మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల : ఒకరేమో దేవుళ్లపైనే ఒట్లు వేసి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలం గడుపుతుంటే.. మరొకరేమో దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి శంకర్‌పల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు నమ్మి అధికారం ఇస్తే ఈ నాయకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేయటం చూసి చేవెళ్ల వెంకటేశ్వర స్వామి సైతం ఆయన ఈ ప్రాంతానికి రాకపోతే బాగుండు అనుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ ఇంటి మీద వాలిన కాకిని కూడా తన ఇంటి మీద వాలనివ్వనని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రంజిత్‌రెడ్డి ఏ ఇంటి మీద కాకి అని చేర్చుకున్నాడో చెప్పాలన్నారు. నమ్మిన పార్టీని, కేసీఆర్‌ను మోసం చేసిన రంజిత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇక బీజేపీ అభ్యర్థి రాముడి గుడి, రాముడి పేరు చెప్పి ఓట్లు వేయాలని అడుగుతున్నారని.. ప్రజలే ఈ అభ్యర్థుల తీరును గుర్తించాలన్నారు. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెలిసిన నాయకుడిగా లోక్‌సభలో ఈ ప్రాంత గొంతుకగా ఉంటానని.. పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ అంటే ప్రజల్లో ఒక నమ్మకమని.. అది ఇప్పుడు ప్రజలు గుర్తిస్తున్నారని ఈ ఎన్నికల్లో దీనిని రుజువు చేసి చూపించాలన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. బీసీ నాయకుడు కాసానిని గెలిపించేందుకు బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంసెబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబు, మండల నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోపాల్, పాపారావు, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, నర్సింహ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్టాఫీసుల్లో రెవెన్యూ స్టాంపులు నిల్

బొంరాస్‌పేట: ఆర్థిక లావాదేవీలకు, అధికారిక ఒప్పందాలకు రెవెన్యూ స్టాంపుల వాడటాన్ని ప్రభుత్వం కల్పించింది. ప్రస్తుతం పోస్టాఫీసుల నుంచి ప్రజలకు అందే రెవెన్యూ స్టాంపులు కరువయ్యాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగినప్పటి నుంచి మీసేవ కేంద్రాలు, బుక్‌స్టాల్, జనరల్ స్టోర్స్, మెడికల్‌షాపులు ఇలా అన్ని రకాల చిన్నపాటి దుకాణాల్లో అమ్మడం సహజంగా మారింది. బయటి దుకాణాల్లో రూపాయి విలువచేసే రెవెన్యూ స్టాంపును రూ.5 నుంచి రూ.8 వరకు అమ్మతున్నారు. కొన్ని చోట్ల రూ.10వరకు అమ్ముతున్నారు. పోస్టాఫీసుల్లో ఒక్కటి కూడా లేదని, తమకు వచ్చిన ప్రకారం ఒక్కరోజు కూడా మిగలడం లేదని పోస్టాఫీసు అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ స్టాంపుల కొరత తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి వృథాకు చర్యలు



బాగు చేసిన పైప్‌లైన్ ఏయిర్ వాల్వ్

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'భగీరథ నీరు వృథా'అనే శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. ధారూరు మండల పరిధిలోని తరితోపుల గ్రామ సమీపంలో పైప్‌లైన్ ఏయిర్ వాల్వ్ నుంచి నీరు వృథాగా పోతుండగా సిబ్బందిచే మరమ్మతు చేయించారు. నీటి వృథాను అరికట్టిన అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



ఓటరు స్లిప్పులు ఇస్తున్న ఆర్ఐ రాజిరెడ్డి

పెద్దేముల్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓటరు స్లిప్పులను శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పంపిణీ చేశారు. ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పు అందేలా అన్ని చర్యలు తీసుకున్నామని పెద్దేముల్ తహసీల్దార్ కిషన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో ఓటరు స్లిప్పులు సుమారు 39వేలకు పైగా ఉన్నాయని ఇంత వరకు 90శాతం పంపిణీ బీఎల్ఓల ద్వారా పూర్తి చేశామన్నారు. మిగతావి పోలింగ్ తేది లోపు అన్ని గ్రామాల్లో ఓటరు స్లిప్పులు అందజేస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొత్తూరు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అర్జునయ్య(45) గురువారం మధ్యాహ్నం తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఒంటిపై రక్తగాయాలు కనిపించడంతో మృతుడి కూతురు సుప్రజ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు సంఘటన స్థలంలో పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉపాధి కూలీల ఓట్లే లక్ష్యం

ప్రధాన పార్టీల ప్రచార జోరు

- పొద్దు పొద్దున్నే గ్రామాల్లో సందడి వాతావరణం



కుదురుమళ్ల చెరువు వద్ద కూలీల ఓట్లను అభ్యర్థిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచార వ్యూహాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజల వద్దకే నాయకులు వివిధ రూపాల్లో దగ్గరవుతున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. ఈ పనులకు కూలీలు అధిక సంఖ్యలో వెళ్లడంతో రాజకీయ నాయకులు వాటిని ప్రచార వేదికలుగా మార్చుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల నాయకులు ఉపాధి హామీ పనులు జరిగే చోట ప్రచారం నిర్వహిస్తూ కూలీల ఓట్లను రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం పూర్తి కావడంతో ప్రచారం వేడెక్కింది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఒకవైపు వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలో 33 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రతి గ్రామంలో రోజుకు 150 నుంచి 200 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. పెద్ద పంచాయతీల్లో కూలీల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఉదయం పూటనే ప్రచారానికి అనువైన సమయం కావడంతో ఉపాధి కూలీల వద్దకు నాయకులు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

ఖర్చు లేకుండా ప్రచారం

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించాలంటే జనసమీకరణకు ఎక్కువగానే ఖర్చు చేయాల్సి వస్తోంది. రాజకీయ పార్టీల సమావేశాలకు వచ్చే వారికి రూ.200 నుంచి రూ.300ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పనులు జరిగే చోట జనం ఎక్కువగా ఉంటుండడంతో తమ ప్రచారానికి ఎలాంటి ఖర్చు లేకుండా సాగుతోందని రాజకీయ పార్టీల నాయకులు భావిస్తున్నారు. టీ, టిఫిన్‌తో కొన్ని పార్టీలు మాత్రం సరిపెడుతున్నాయి.

కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: కాంగ్రెస్ నాయకులు మోసగాళ్లకే మోసగాళ్లని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం మండలంలోని మంబాపూర్, గాజీపూర్, పెద్దేముల్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగష్టు 15 తేదీ లోపు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకు రుణమాఫీ చేయకుంటే తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా.. అని సవాల్ విసిరారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ కష్టాలు తప్పవన్నారు. చేవేళ్ల నియోజకవర్గ ప్రజలు కేసీఆర్ మద్దతు ఇచ్చిన అభ్యర్థినే ఇప్పటి వరకు గెలిపించారని గుర్తు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ భారీ మెజార్టీతో గెలవబోతున్నారన్నారు. అప్పట్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి కారు గుర్తుపైనే గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. హామీల పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్ పార్టీపై కుట్ర చేస్తున్నాయన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతును వినిపించేది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటేనన్నారు. కనీసం ప్రభుత్వానికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఇవ్వడానికి చేతకావడం లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు రుక్మాపూర్ రమేశ్, శ్రావణ్‌కుమార్, రవినాయక్, పాండునాయక్, వీరప్ప, బలరాం, చంద్రప్ప, ప్రసాద్ వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మంబాపూర్‌లో మాట్లాడుతున్న పైలెట్ రోహిత్‌రెడ్డి

నేడు భద్రేశ్వరస్వామి రథోత్సవం



స్వామి వారి పల్లకిసేవలో భక్తులు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

తాండూరు: తాండూరు పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోనే భారీ ఎత్తున జరిగే ఉత్సవాలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. శనివారం రాత్రి రథోత్సవం కావడంతో మున్సిపల్ అధికారులు భద్రత పరమైన ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. ఉదయం ఆలయంలో కలశ పూజ నిర్వహించనున్నారు. అనంతరం కలశమును పుర వీధుల గుండా ఊరేగిస్తారు. సాయంత్రం 6 గంటలకు రథంపైకి కలశ ప్రతిష్ఠాపన, రాత్రి 11.05 గంటలకు రథోత్సవం జాతర నిర్వహించనున్నారు. ఆలయం నుంచి బస్వణ్ణకట్ట వద్దకు రథాన్ని తీసుకెళ్లి బస్వణ్ణకు ప్రత్యేక పూజలు చేస్తారు. స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రథోత్సవంలో భాగంగా పూర్ణకుంభాభిషేక పూజలతో ఉత్సవాలను ప్రారంభించనున్నారు. 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పశు ప్రదర్శన, బస్వణ్ణకట్ట వద్ద రాత్రి 1 గంటలకు లంకాదహనము కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైభవంగా భద్రేశ్వరుడి పల్లకి సేవ

భావిగి భద్రేశ్వర దేవాలయంలో గురువారం రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. ఈ ఉత్సవాలకు వీరశైవ సమాజం ప్రతినిధులతో పాటు పలువురు భక్తులు హాజరై పల్లకి సేవ నిర్వహించారు.

గూడు లేక.. ఎండలకు తాళలేక



గూడు లేక ఎండలో కూర్చున్న కూలీలు

ఉపాధి హామీ కూలీల గోస

- పట్టించుకోని అధికారులు



నీరు లేక ఇబ్బందులు పడుతున్న మహిళలు

పెద్దేముల్: గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు పనుల చేసే దగ్గర గూడు, నీరు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా మండలంలో ఈ నిబంధలను సక్రమంగా అమలు కావడం లేదు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా లాభం లేదన్న ఆరోపణలున్నాయి. రోజు రోజుకు ఎండలు ముదరడంతో కూలీలకు పని ప్రదేశాలల్లో గూడు, నీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రుక్మాపూర్, మంబాపూర్, రెగోండితో పాటు పలు గ్రామాలల్లో పనులు చేసే వద్ద గూడు, నీరు లేక కూలీలు ఇళ్ల నుంచి నీరు తెచ్చుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం కానుగ పొరుకతో అయినా గూడు కల్పించకపోవడం ఎంతవరకు న్యాయమని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వచ్చిన సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రెండు, మూడు బిందెల నీరు తెచ్చి మరుసటి రోజు నుంచి అసలుకే తీసుకురావడం లేదని కూలీలు వాపోతున్నారు. అంతేగాకుండా పని ప్రదేశాలల్లో కూలీలకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారని చూసే వారే లేరని మండి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో జరిగే పని ప్రదేశాలల్లో గూడు, నీరు తప్పకుండా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయమై మండల పీఓ నర్సింలును వివరణ కోరగా.. తప్పకుండా వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుగుణమ్మ
- ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొనుగోలు కేంద్రంలో వరి తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సుగుణమ్మ

దోమ : కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులను గురిచేస్తే చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుగుణమ్మ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని బొంపల్లి, శివారెడ్డిపల్లి, ఖమ్మంనాచారం, దోమ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి ఎంతో కృషి చేయడమే కాకుండా, గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు గన్నీ బ్యాగులు, మంచినీరు, టార్పలిన్లు, సుత్తిళ్లు అందుబాటులో ఉంచిందన్నారు. మద్దతు ధరతో ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవదన్నారు. కార్యక్రమంలో బొంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కోళ్ల సురేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నంబి గురుస్వామి ఉత్సవాలు

నవాబుపేట: మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో నంబి గురుస్వామి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం మానసపూజ వైభవంగా జరిపించారు. అనంతరం వైకుంఠోత్సవం, గరుడ సేవోత్సవం చిట్టిగిద్ద గ్రామం నుంచి నంబిగురుస్వామి మఠం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, రఘుపంతులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ సర్పంచులు, పద్యవెంకట్‌రెడ్డి, జగన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారి సేవలో పాల్గొన్న భక్తులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు రామచంద్రయ్య(51) భారతమ్మ గత నెల 27న వివాహానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో మండలంలోని హేంలాల్ పంక్షన్‌హాల్ వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పింది. దీంతో ఇరువురూ కింద పడ్డారు. ఈ ప్రమాదంలో భారతమ్మ స్వల్ప గాయాలతో బయట పడింది. భర్త రామచంద్రయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామచంద్రయ్య శుక్రవారం ఉదయం మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం



సందీప్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి పట్టణంలోని కమ్మదనం బైపాస్‌పై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని రతన్ కాలనీకి చెందిన సందీప్(16) భగత్‌సింగ్ కాలనీకి చెందిన తన స్నేహితుడి ఇంట్లో నిద్రించాడు. గురువారం అర్ధరాత్రి సందీప్ వ్యక్తిగత పని నిమిత్తం కమ్మదనం బైపాస్ రహదారికి వెళ్లాడు. నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న సందీప్‌ను హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న టావేరా వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాంచందర్ ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఆమనగల్లు: మండలంలోని కోనాపూర్ గేటు వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం వాటర్ ట్యాంకర్(ట్రాక్టర్) అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని గేటుతండాకు చెందిన నరేశ్ వాటర్ ట్యాంకర్‌లో నీటిని నింపుకొని కోనాపూర్ వెళుతుండగా గేటు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నరేశ్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కళాశాల సిబ్బంది

కొడంగల్ రూరల్: ఎయిడ్స్ రహిత సమాజం కోసం గ్రామాల్లో యువత అవగాహన కల్పించాలని ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఈ.సోమ్లా, వి.శ్రీధర్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎయిడ్స్‌పై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోపాటు యువత ప్రజలను చైతన్యం చేసి వ్యాధిని నిర్మూలించాలన్నారు. ఎయిడ్స్ రోగులకు ఔషధాలకంటే ఆదరణే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేశ్‌బాబు, అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో నీటమునిగి బాలుడి మృతి
- దేవునిఎర్రవల్లిలో విషాద ఛాయలు



రామకృష్ణ (ఫైల్)

చేవెళ్ల: రేయింబవళ్లు శ్రమించి విద్యాబుద్ధులు నేర్పించిన తల్లిదండ్రులకు ఓ కుమారుడు తీరని గర్భశోకం మిగిల్చాడు. సరదాగా బావిలోకి ఈతకు వెళ్లి తిరిగిరాని లోకాలకు చేరి పుట్టెడు దుఃఖంలోని నెట్టి వేశాడు. ఈ విషాద సంఘటన చేవెళ్ల మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎదిరే విఠలయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు రామకృష్ణ(16) గ్రామంలోని పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావటంతో ఆయన స్నేహితులతో కలిసి సమీపంలోని బావిలోకి ఈతకు వెళ్లారు. వెళ్లిన వారందరికీ ఈత రావడంతో బావిలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో రామకృష్ణ పైనుంచి బావిలోకి డైవ్ కొట్టి తిరిగి పైకి రాలేదు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న స్నేహితులు ఎవరూ గమనించలేదు. కాసేపటికి బావిలో దూకిన రామకృష్ణ కనిపించటం లేదని మిగతావారు వెతికారు. దీంతో విషయాన్ని కుటుంబసభ్యులు, గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు బావిలో ఉన్న నీళ్లను మోటార్ సహాయంతో బయటకు తోడేశారు. అనంతరం దిగి వెతకడంతో బావిలో అడుగున ఉన్న బురదలో డైవ్ కొట్టినట్లుగానే ఇరుక్కుపోయి విగతజీవిగా ఉన్న రామకృష్ణను బయటకు తీశారు. అప్పటికే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బావి వద్దకు చేరుకున్నారు. చేతికి వచ్చిన కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. వారి రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. ఈతకొట్టే సమయంలో మృతుడు డైవ్ కొట్టిన సమయంలో గమనించక ఎవరైనా పైన దూకి ఉండవచ్చునని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'హస్తం'తోనే గిరిజనులకు అండ



సాలీడులో ప్రచారాన్ని నిర్వహిస్తున్న నాయకులు

బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్‌నాయక్

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన అభ్యున్నతి సాధ్యమని అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్ నాయక్, పార్టీ మండల నేత విఠల్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సాల్వీడు గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. ప్రజలందరూ ఆలోచించి ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి

యాచారం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రశాంతతపై అవగాహన కోసం శుక్రవారం మాల్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో కేంద్ర పోలీస్ బలగాలతో కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటే వజ్రాయుధం అన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, యాచారం సీఐ శంకర్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్ సూచించారు. బండారి రాజయ్య-లక్ష్మమ్మ సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంబలి, చలి వేంద్రాలను పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి, చలి వేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎండాకాలంలో గత 25 ఏళ్లుగా అంబలి, తాగునీరు పంపిణీ చేస్తున్నామన్నారు. జీవితంలో మనం ఎంత సంపాదించామనేది ముఖ్యం కాదని, సమాజానికి ఎంత సేవ చేశామనేది ప్రధానమని అన్నారు. ప్రతిఒక్కరూ సేవా భావంతో ముందుకు సాగాలని, సమాజానికి మనవంతుగా సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో సురేశ్, రవీందర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్, వెంకటేశ్‌గుప్తా, సుధాకర్, మల్లికార్జునప్ప, సత్యనారాయణసింగ్, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.